క్లుప్తంగా

రేపు విద్యాసంస్థల బంద్



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

కదిరి అర్బన్: నీట్ పరీక్షను రద్దు చేయాలని ఈ నెల నాలుగో తేదీన విద్యా సంస్థల బంద్ నిర్వహించనున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. మంగళవారం కదిరి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో విద్యాసంస్థల బంద్ కరపత్రాలను వారు విడుదల చేశారు. నీట్ ఫలితాల్లో జరిగిన అక్రమాలపై సుప్రీం కోర్టు జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నీట్‌లో 67 మంది విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడం అనుమానాలకు తావిస్తోందన్నారు. నీట్ పరీక్షలు నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షను రద్దు చేయాలని కేంద్రానికి లేఖ రాయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎస్ఏ, ఎస్ఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ నాయకులు నరసింహ, ఉపేంద్ర, పవన్, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్సిడీ జొన్నలు తీసుకోండి

అమడగూరు: మహమ్మదాబాద్ పశువైద్యశాలలో సబ్సిడీపై ఇస్తున్న జొన్నలను తీసుకోవాలని మంగళవారం పశువైద్య సిబ్బంది సూచించారు. సబ్సిడీ పోను 5 కేజీల జొన్నల బ్యాగు ధర రూ.130గా నిర్ధారించారని, కావాలసిన రైతులు ఆధార్‌కార్డు తీసుకుని పశువైద్యశాలలో సంప్రదించాలన్నారు. జొన్న సాగు ద్వారా పశువులకు మంచి దాణా లభిస్తుందన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో మెరుగైన వైద్య సేవలు



బీసీజీ టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

తాడిమర్రి: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు హెల్త్ సూపర్‌వైజర్ రామ్‌కుమార్ పేర్కొన్నారు. పెద్దకోట్ల గ్రామంలో మంగళవారం ఆయన వైద్య సిబ్బందితో కలసి గర్భిణులు, బాలింతలు, పలువురు రోగులకు బీపీ, షుగర్, రక్తం, మూత్ర తదితర పరీక్షలు చేశారు. అవసరమైన మందులు అందజేశారు. అనంతరం ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. క్షయవ్యాధిగ్రస్తులు, వారి కుటుంబ సభ్యులు, వృద్ధులకు క్షయవ్యాధి నివారణ టీకాలు వేయించారు. అలాగే అతిసార వ్యాధికి గురికాకుండా ప్రతి ఒక్కరూ పరిశుభ్రమైన ఆహారం, సురక్షిత నీటినే తాగాలని ఆయన గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త రంగనాయకులు, ఏఎన్ఎం నాగలక్ష్మమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి సరుకుల వితరణ

అమడగూరు: గాజులపల్లి సమీపంలోని శ్రీ మాతృశ్రీ వృద్ధాశ్రమానికి అమడగూరుకు చెందిన కాంట్రాక్ట్ సర్వేయర్ సురేంద్ర నిత్యావసర సరుకుల వితరణతో పాటుగా రూ 5 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా దాతకు ఆశ్రమ నిర్వాహకురాలు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు.

ఆర్ఎంపీల సమస్యలు పరిష్కరించాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఆర్ఎంపీలు

కదిరి టౌన్: ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను కదిరి తాలూకా అధ్యక్షులు డాక్టర్ అల్లాబకాష్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం నాయకులు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ మస్తానయ్య, రాష్ట్ర ఫెడరేషన్ అధ్యక్షులు ప్రసాద్, సెక్రటరీ డాక్టర్ సుధాకర్, ఆర్ఎంపీలు వేమారెడ్డి, బాషా, అక్బర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పంచాంగం స్వామి మృతి



నాగేంద్రస్వామి (ఫైల్)

అమడగూరు: మండలంలో ప్రసిద్ధిగాంచిన శీతిరెడ్డిపల్లికి చెందిన పంచాంగం నాగేంద్ర స్వామి (63) సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన 40 ఏళ్లుగా మండల వ్యాప్తంగా కాకుండా కర్ణాటక ప్రాంతంలోనూ పౌరోహిత్యం చేసుకుంటూ మంచి పేరు సంపాదించుకున్నారు. అకస్మాత్తుగా ఆయన మృతి చెందడంతో మండల వాసులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. మృతదేహాన్ని చూడటానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. మంగళవారం శీతిరెడ్డిపల్లిలో అంత్యక్రియలు పూర్తి చేశారు.

క్రమశిక్షణతో చదువుకోండి





వంట సరుకుల నాణ్యత పరిశీలిస్తున్న ఏబీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజకుళ్లాయప్ప , కరపత్రాలను విడుదల చేస్తున్న వైద్యాధికారి గోవర్దన్‌నాయుడు

చెన్నేకొత్తపల్లి: విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ క్రమశిక్షణతో చదువు కోవాలని ధర్మవరం అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజకుళ్లాయప్ప విద్యార్థులకు సూచించారు. చెన్నేకొత్తపల్లిలోని బీసీ బాలుర వసతి గృహాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులు బస చేసే గదులను పరిశీలించారు. వారికి వడ్డించే అల్పాహారాన్ని పరిశీలించారు. స్టాక్ రూంలో నిల్వ ఉంచిన సరుకుల నాణ్యత, ఎంత స్టాక్ ఉందనే విషయాలపై ఆరా తీశారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. వ్యక్తిగత శుభ్రత పాటిస్తే ఎలాంటి అనారోగ్యాలకు గురికాకుండా చదువు కోవచ్చని సూచించారు. విద్యార్థులు స్నేహభావంతో మెలగాలని, కష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు తీసుకురావాలని సూచించారు.

పరిశుభ్రతతో అతిసారం దూరం

తాడిమర్రి: చేతుల శుభ్రత, పరిసరాల పరిశుభ్రతతోనే అతిసార (డయేరియా) వ్యాధి సోకదని వైద్యాధికారి గోవర్దన్‌నాయుడు విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ)లో మంగళవారం ఆయన వైద్య సిబ్బందితో కలసి విద్యార్థినులకు అతిసార (డయేరియా) వ్యాధిపై అవగాహన కల్పించారు. భోజనం చేయడానికి ముందు చేతులు, కాళ్లను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలన్నారు. స్వచ్ఛమైన నీరు, వేడి ఆహార పదార్థాలనే తీసుకోవాలని విద్యార్థినులకు సూచించారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలసి అతిసార సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ లక్ష్మీదేవి, ప్రిన్సిపాల్ వాణిశ్రీ, ఏఎన్ఎం కోమలి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా ధర్మవరం

- అధికారులు సహకరించాలన్న మంత్రి సత్యకుమార్



అధికారులతో వివరాలు తెలుసుకుంటున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం అర్బన్: ఆదర్శ నియోజకవర్గంగా ధర్మవరాన్ని తీర్చిదిద్దుతానని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఇందుకు అన్ని శాఖల అధికారులూ సహకరించాలని కోరారు. ఆర్డీఓ కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికపై జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో పక్షవాతం నిర్మూలించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో నియోజకవర్గ అభివృద్ధి కోసం సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నేతన్నల అభ్యున్నతికి చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు సామాజిక బాధ్యతతో విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఆర్డీఓ వంశీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్, డీఈఓ మీనాక్షి, డీఎంఅండ్‌హెచ్‌ఓ మంజువాణి, విద్యుత్‌శాఖ ఎస్ఈ సుధాకర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుబ్బారావు, హ్యాండ్‌లూమ్ టెక్స్‌టైల్స్ ఏడీ రమేష్‌బాబు, మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రొద్దం: ఆడపిల్ల భారం కాదు.. ఆణిముత్యం.. 18 సంవత్సరాలు నిండిన తర్వాతే ఆడ బిడ్డలకు పెళ్లిళ్లు చేయాలని అధికారులు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆర్డీటీ, జిల్లా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలల హక్కులు, బాల్య వివాహాలు, వాటి వల్ల అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ శాంతలక్ష్మి, ఆర్డీటీ మడకశి రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ చాలా మంది తల్లిదండ్రులు బాలికలకు సరైన వయస్సు రాకమందే పెండ్లి చేసి తమ భారం తగ్గించుకోవాలని ఆలోచిస్తుంటారని తెలిపారు. చదువుకునే వయస్సులోనే వివాహ బంధం పేరుతో బంధం వేయరాదన్నారు. మైనార్టీ తిరకముందే పెళ్లి చేసి చిన్నారుల జీవితాలతో ఆడుకుంటున్నారని పేర్కొన్నారు. బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేసేలా ఐసీడీఎస్ తో పాటు వివిధ శాఖల అధికారులు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టినట్లు వివరించారు. బాల్య వివాహాలు చేస్తే అనర్థాలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. 2006 బాల్య వివాహాల నిరోధక చట్టాల ప్రకారం వివాహం చేసుకున్నా, నిర్వహించినా, సహకరించినా చట్టరీత్యా శిక్షార్హులు అవుతారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, వైద్యాధికారిని భాగ్యలక్ష్మి, ఆర్డీటీ టీం లీడర్ ఆదినారాయణ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ అనురాధ, మహిళా పోలీస్ నాగలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

వైభవంగా వెండిరథం ప్రాకారోత్సవం



వెండి రథంలో కొలువుదీరిన ఖాద్రీశుడు

కదిరి టౌన్: శ్రీఖాద్రీ నృసింహాలయంలో మంగళవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వసంత వల్లభుని వెండిరథం ప్రాకారోత్సవం నిర్వహించారు.వెండి రథంపై కొలువుదీరిన స్వామివారికి సుగంధ పుష్పాలతో, కదిరి మల్లెలు, తులసీ మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. స్వామివారిని భక్తులు దర్శించుకుని తరించారు.

ఉన్నత చదువుతోనే బంగారు భవిష్యత్తు



దొమ్మరహట్టి ప్రాథమిక పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈఓ శ్రీధర్

రొళ్ల: ప్రాథమిక విద్య దశ నుంచి క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి బంగారు భవిషత్తును పొందాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం మండల పరిధిలోని దొమ్మరహట్టి, బాజయ్యపాళ్యం ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు తనిఖీ చేసి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీధర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. ఇంటి పనులకు పిల్లలను పరిమితం చేయకుండా చక్కగా చదువుకొనే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోజూ మెను ప్రకారం రుచికరమైన భోజనాన్ని వడ్డించాలని ఏజెన్సీల నిర్వాహకులకు సూచించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎండీఎం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన

అమరాపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం ఆవరణలో మంగళవారం ఎస్ఐ జనార్థన్‌నాయుడు ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల డ్రైవర్లకు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీసాయి విద్యానికేతన్, సరస్వతి విద్యామందిరం, శ్రీదేవి, వాసవి, జేకే ప్రైవేట్ పాఠశాలల బస్సుల రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు తదితర వాటిని తనిఖీ చేశారు. అదేవిధంగా గ్రామాల నుంచి విద్యార్థులను ఏ విధంగా బస్సులో ఎక్కించాలి.. ఎంత వేగంతో రావాలి తదితర రోడ్డు నియమ నిబంధనలను వివరించారు. కే.శివరం గ్రామంలో ప్రజలకు నూతన చట్టాల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, డ్రైవర్లు పాల్గొన్నారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

లేపాక్షి: ప్రసిద్ధి చెందిన లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయంలో మంగళవారం ఉదయం దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేషంగా పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

మహాలక్ష్మీదేవికి పూజలు

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో ఘనంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే అమ్మవారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ విగ్రహానికి అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన తదితర పూజలు చేశారు.


వైభవంగా కొల్లాపురమ్మ జాతర



జ్యోతులు మోస్తున్న మహిళలు

పావగడ: పట్టణంలో ఉన్న శాంతినగర్‌లో గ్రామ శక్తి దేవతలు కొల్లాపురమ్మ, సొప్పులమ్మదేవి జాతరోత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామశక్తి దేవతలకు మూగ జీవాలు బలి ఇచ్చారు. అమ్మవార్ల ఊరేగింపులో మహిళలు జ్యోతులు మోశారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ శంకరరెడ్డి, కౌన్సిలర్లు రాజేశ్, టెంకాయల రవి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సహకారం అవసరం




సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి

ధర్మవరం అర్బన్: ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారుల సహకారం అవసరమని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మంగళవారం చైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ పట్టణంలోని అభివృద్ధి పనులు చేయడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రజకులకు దోబీఘాట్‌లు ఏర్పాటు చేయాలని, డివైడర్ల మధ్య ఎండిన మొక్కలు తొలగించి కొత్తవి నాటాలని సూచించారు. వీధిలైట్ల సమస్య పట్టించుకోవడం లేదని చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్లు జయరామిరెడ్డి, శంషాద్‌బేగం, అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఈఈ సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి



డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

కదిరి టౌన్: కదిరికి చెందిన న్యాయవాది రామస్వామినాయుడుపై దాడిచేసిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని పలువురు న్యాయవాదులు మంగళవారం డీఎస్పీ శ్రీలతకు వినతిపత్రం అందజేశారు. నిందితులను అరెస్ట్ చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. మరోవైపు దాడిని ఖండిస్తూ దుండగులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు పట్టణంలో శుక్రవారం వరకు విధులు బహిష్కరిస్తూ తీర్మానం చేశారు. ఇప్పటికే అనంతపురం బార్ అసోసియేషన్ న్యాయవాదులు రెండు రోజుల పాటు విధులు బహిష్కరించినట్లు తీర్మానించారు. హిందూపురంలోనూ విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ ఘటనపై జిల్లా వ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించని అధికారులు

నల్లమాడ: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మండల అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని పెమనకుంటపల్లి తండా గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆనంద్‌నాయక్ ఆరోపించారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ పెమనకుంటపల్లి తండాలో సోమవారం సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారన్నారు. ప్రొటోకాల్ ప్రకారం సర్పంచ్‌ను ఆహ్వానించాల్సి ఉన్నా తనకు మాటమాత్రమైనా చెప్పకుండా టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది పింఛన్లు అందజేశారన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో అధికారులు ప్రొటోకాల్ పాటించాలని సర్పంచ్ ఆనంద్‌నాయక్ కోరారు.

డయేరియాపై గ్రామస్తులకు అవగాహన

చెన్నేకొత్తపల్లి: డయేరియా ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్య సిబ్బంది సూచించారు. డయేరియా ఆపండి కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ గేట్ పీహెచ్‌సీ పరిధిలోని న్యామద్దెల గ్రామంలో మంగళవారం వైద్య సిబ్బంది పర్యటించారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఎవరికైనా అతిసారం లక్షణాలు ఉన్నాయా అని ఆరా తీశారు. పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. అతిసారం నివారణకు ఆర్ఎస్ పొకెట్లు పంపిణీ చేశారు. పాఠశాలలను సందర్శించి చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్, ఏఎన్ఎం అశ్విని, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి ఘన సన్మానం



చంద్రాయుడును సత్కరిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

పుట్టపర్తి అర్బన్: ఉద్యోగ విరమణ చేసిన మండలంలోని కర్ణాటకనాగేపల్లి ఉపాధ్యాయుడు చంద్రాయుడుని మంగళవారం ఘనంగా సన్మానించారు. పుట్టపర్తిలోని శివాలయం స్కూల్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సత్కరించారు. ఎంఈఓలు ప్రసాద్, ఖాదర్‌వలిబాషా మాట్లాడుతూ చంద్రాయుడు విశ్రాంత జీవితం హాయిగా సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పీవీ రమణారెడ్డి, సుబ్బారెడ్డి, సునీత, రజనీకాంత్‌రెడ్డి, సుధారాణి, రామమోహన్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులు చంద్రాయుడుకు జ్ఞాపికలు అందజేసి ఘనంగా వీడ్కోలు పలికారు.

నేడు జాబ్‌మేళా

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని ఎస్‌డీఆర్‌ఆర్ కళాశాలలో బుధవారం బిజినెస్ సొల్యూషన్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఫైనలియర్ చదువుతున్న, డిగ్రీ పూర్తయిన విద్యార్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు.

నేడు క్యాంపస్ డ్రైవ్

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని ఇబ్రహీంపట్నం ఐటీఐ కాలేజీలో బుధవారం మారుతి సుజుకి కంపెనీ ఆధ్వర్యంలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.15వేల వేతనం ఇస్తారన్నారు. ఐటీఐ పూర్తి చేసిన వారు హాజరు కావొచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 90142 19369 నంబరులో సంప్రదించాలన్నారు.

సజావుగా వేలం పాట

నల్లచెరువు: పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణమాసంలో పూల హారాలు, పార్కింగ్ రుసుము వసూలూ చేయడానికి ఈఓ రవీంద్రరాజు, సర్పంచ్ పంచరత్నమ్మ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వేలం పాట సజావుగా జరిగింది. పూల హారాలు విక్రయించే హక్కును రూ.68వేలకు జి.సూర్యశేఖర్‌రెడ్డి, పార్కింగ్ రుసుము వసూలు హక్కు రూ.1.20 లక్షలకు వస్పత్ నాయక్ దక్కించుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ డి.రమేష్ బాబు, ఆలయ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ దేవరింటి భాస్కర్‌రెడ్డి, అర్చకులు ఆంజనేయదాస్, నాగరాజు పాల్గొన్నారు. పూజా సామాగ్రి, టెంకాయలు విక్రయించే హక్కు వేలం పాటను ఈ నెల 9వ తేదీ నిర్వహించనున్నట్లు ఈఓ, సర్పంచ్ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి



గ్రామ సభ నిర్వహిస్తున్న అధికారులు

నల్లచెరువు: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నల్లచెరువు పంచాయతీ కార్యదర్శి వసుంధర తెలిపారు. మంగళవారం సచివాలయం-1లో గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ గ్రామంలో నీరు, వీధిలైట్లు, డ్రైయినేజీ తదితర మౌలిక సదుపాయాలు మెరుగు పరుస్తామని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితో పాటు ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు ప్రశంసనీయం



విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సిబ్బంది

ఓడీచెరువు: ఉపాధ్యాయుల సేవలు ప్రశంసనీయమని వక్తలు పేర్కొన్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన డి.శ్రీనివాసరెడ్డి బాబాసాబ్ పల్లి, బి.షకూర్ ఖాన్ (ఓడీచెరువు), సి.రామక్రిష్ణ (నల్లగుట్లపల్లి)కి మంగళవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఉపాధ్యాయులు, ఎంఈఓలు, బోధనేతర సిబ్బంది, మిత్రులు వీరిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓలు రమణ, సురేష్, రిటైర్డ్ ఎంఈఓ జయచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు శంకరరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.